క్లుప్తంగా

పెద్దమ్మతల్లి ఆలయంలో 'శివలీలలు'



హరికథ చెబుతున్న నాగరాణి బృందం

పాల్వంచరూరల్: అమ్మవారిని దర్శించే భక్తుల కాలక్షేపం కోసం పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం శివలీలలు హరికథ ఏర్పాటు చేశారు. మండల పరిధి శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ ప్రాంగణంలో ఆదివారం తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల అధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన నాగరాణి బృందం హరికథను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు హరికథ విని సంతోషం వ్యక్తం చేశారు.

అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం

నవభారత్: రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొల్లూరులో జరుగుతున్న పోటీలలో పురుషుల విభాగంలో భద్రాచలానికి చెందిన వర్స రాజు 50.45 సెకన్లలో నాలుగు వందల మీటర్లు పరుగు పందాన్ని పూర్తి చేసి బంగారు పతకాన్ని సాధించాడు. 14 సంవత్సరాల విభాగంలో కొత్తగూడేనికి చెందిన సాయి ఆదిత్య వంశీ 400 మీటర్లు పరుగు పందాన్ని 54.20 సెకన్లలో పూర్తి చేసి రజిత పతకం సాధించారని జిల్లా అథ్లెటిక్స్ జనరల్ సెక్రటరీ కె.మహీందర్ ఆదివారం తెలిపారు. కోచ్‌లు కె.శివకుమార్, శ్రీనిశాసరావులను జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.హనుమంతు రావు రాజు, వంశీలకు అభినందనలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



శ్రీనివాస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపాదాస్ మున్షీ

కొత్తగూడెంరూరల్: హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పిలుపు మేరకు తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, కొత్తగూడెం నివాసి కోదాడ శ్రీనివాస్ యాదవ్ కేంద్ర మాజీ మంత్రి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమీక్షంలో ఆదివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

27న సేవాలాల్ జయంతి వేడుకలు

ఇల్లెందు: సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను ఇల్లెందులోని సింగరేణి గ్రౌండ్‌లో నిర్వహించనున్నారు. ఈ నెల 27న ఉదయం కోటిలింగాల క్రాస్ రోడ్ వద్ద ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి సద్భావన యాత్రం ప్రారంభమై సింగరేణి జేకే గ్రౌండ్‌కు చేరుకోనుంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ ప్రియాంక అల, సింగరేణి సీఎండీ బలరాం, ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్, ఐటీడీఏ పీఓ, ఎస్పీ రోహిత్ రాజ్, మాజీ ఎంపీ బలరాంనాయక్, తేజావత్ బెల్లయ్య నాయక్, బోజమహరాజ్, ఎఫ్‌డీఓ వెంకన్న, చైర్మన్ డీవీ పాల్గొననున్నారు. ఇందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు బానోతు రాంబాబు, భూక్యా ప్రవీణ్‌లు ఆదివారం తెలిపారు.

పారిశుద్ధ్యం అధ్వానం



హనుమాతండాలో అధ్వానంగా మురుగు కాలువ

టేకులపల్లి: కోయగూడెం పంచాయతీ హనుమాతండాలో పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామంలోని వీధుల్లో ఎక్కడ చూసినా మురుగు నిలవ్వలే దర్శనమిస్తున్నాయి. ప్రతీఇంటి నుంచి మురుగు నీరు పారుదలకు డ్రెయినేజీలు లేకపోవడంతో రోడ్డు పక్కనే మురుగు నీరు నిల్వ ఉంటోంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్వాసన వస్తోంది. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లిన దాఖలాలు లేవు. కాలువల్లో సిల్ట్ తీసిన ఆనవాళ్లు కూడా లేవు. వారం రోజుల పాటు శానిటేషన్ డ్రైవ్ చేసినప్పటికీ ఇక్కడ మాత్రం పారిశుద్ధ్య పనులు చేయలేదు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టణంలో తాగునీటి వృథా

- అడుగడుగునా పైపులైన్ల లీకేజీలు
- నెలల తరబడి పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

పాల్వంచ: పట్టణంలో పైపులైన్ల లీకేజీలతో ప్రజలు సతమతమవుతున్నారు. నిత్యం తాగునీరు భారీ ఎత్తున వృథా అవుతోంది. ఏక్కడ చూసినా పైపులైన్ల లీకేజీలే కనిపిస్తున్నాయి. లీకేజీల వల్ల రోడ్లు దెబ్బతినడటంతో పాటు, బురదమయంగా మారుతున్నాయి. పైపులైన్లలో మురుగు నీరు చేరుతుండడంతో ప్రజలు అనారోగ్యాల బారీన పడుతున్నారు. వీటిని ఎప్పటికప్పుడు సరిచేయాల్సిన మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటే బీసీఎం రోడ్‌లోని అంబేద్కర్ సెంటర్‌లో పైపులైన్ పగిలి రోడ్డు అధ్వానంగా తయారైంది.

అడుగడుగునా లీకేజీలు..

ఎన్నో దశాబ్దాల క్రితం వేసి పైపులైన్లు కావడంతో ఏ వీధిలో చూసినా పైపులైన్ల లీకేజీలే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా ఒడ్డుగూడెం రోడ్, బీసీఎం రోడ్డు, అంబేద్కర్ సెంటర్, కేఎస్పీ రోడ్, టీచర్స్ కాలనీ, గట్టాయిగూడెం, గాంధీనగర్‌లలో లీకేజీలు అధికంగా ఉన్నాయి.

నీళ్లు వదిలినప్పుడు లీకుల వద్ద నీరు రోడ్లపై పారుతోంది. దీనివల్ల రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో రూ.లక్షలు ఖర్చు చేసి వేసిన రోడ్లు సైతం నిరంతర లీకేజీల వల్ల దెబ్బతిని ప్రజాధనం వృథా అవుతోంది. మున్సిపాలిటీ ప్రజలకు స్వచ్ఛ నీటి సరఫరా జరగడం లేదు. లీకేజీల్లోకి మలినాలు చేరి మురుగు నీరు వస్తోంది. గత్యంతరం లేక ఆ నీటినే తాగిన స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

అరకొర చర్యలు.. పరిష్కారం కాని సమస్య

పైపులైన్ల లీకేజీలపై అరకొరగానే చర్యలు చేపడుతున్నారు. ఎక్కడికక్కడ లీకేజీలను తాత్కలిక మరమ్మతులతో కప్పిపెడుతున్నారు. లీకేజీ సమస్యలపై శాశ్వత పరిష్కారం చేయడం లేదు. పట్టణంలో ఉన్న అధికారుల్లో ప్రణాళిక లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పలువురు వాపోతున్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏళ్ల తరబడి ఇక్కడే తిష్ట వేసి ఉండటం, పనితీరు మెరుపర్చుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాత్కలిక మరమ్మతులు చేసి చేతుల దులుపుకుంటుకుంటున్నారని చెబుతున్నారు. లీకేజీలు ఉన్న ఏరియాల్లో నిత్యం తిరిగే అధికారులకు అవి కనపడటం లేదా అని వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.



గట్టాయిగూడెం నుంచి ఒడ్డుగూడెం వెళ్లే క్రాస్ రోడ్ వద్ద పైపులైన్ లీకేజీ దృశ్యం



బీసీఎం రోడ్డు అంబేద్కర్ కూడలిలో..

మరమ్మతులు చేయడం లేదు



పైపులైన్ల లీకేజీలను అరికట్టడంలో అధికారులు అస్సలు పట్టించుకోకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. నెలల తరబడి లీకేజీలు ఏర్పడి అధికంగా తాగునీరు వృథా అవుతోంది. దీనివల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పైపులైన్లలోకి మురుగు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోంది.

– ఎండీ షబ్బీర్, గాంధీనగర్

అధికారులు చర్యలు తీసుకోవాలి



ఏ వీధిలో చూసినా పైపులైన్ల లీకేజీలే. గాంధీనగర్, ఒడ్డుగూడెం ఏరియాలో లీకేజీలు అధికంగా ఉన్నా, అటుగా నిత్యం అధికారులు తిరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతామని చెప్పడమే తప్ప పనులు చేయడం లేదు. జిల్లాస్థాయి అధికారులు దృష్టి సారించాలి. – కేసుపాక వెంకటేశ్వర్లు, పాల్వంచ

పట్టభద్రుల ఓట్లు కీలకం



మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి, బానోతు హరిప్రియ

ఇల్లెందు: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటును విజ్ఞతతో ఆలోచించి వేయాలని బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఆశావాహ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఇల్లెందు ఏక్తా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఎవరైనా ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోనట్లయితే తక్షణం నమోదు పత్రం అందజేయాలని కోరారు. పల్లా రాజేశ్వరరెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నిక కావటం వల్ల ఎమ్మెల్సీకి రాజీనామా చేశారని, దానివల్ల ఈ ఉప ఎన్నిక వచ్చిందని చెప్పారు. మేధావులు మౌనంగా ఉంటే సమాజానికి ఎంతో నష్టం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు 4.27 లక్షల మంది తమ ఓటుకు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మార్చి 14 వరకు అవకాశం ఉందన్నారు. అధికార పార్టీ అభ్యర్థి ఎన్నికైతే అధికార పార్టీకి వంత పాడే అవకాశంందన్నారు. ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి అయితే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారని చెప్పారు. విజ్ఞతతో ఆలోచన చేసి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, కౌన్సిలర్లు జేకే శ్రీనివాస్, కడకంచి పద్మ, కటకం పద్మావతి, అజిమ్, చీమల సుజాత, ప్రమోద్, రాజశేఖర్, ఘాజీ, జాఫర్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

విప్లవోద్యమం లక్ష్యంగా మాస్‌లైన్ కృషి



మాట్లాడుతున్న రాజు

ఇల్లెందురూరల్: దేశంలో విప్లవోద్యమం కోసం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కృషి చేస్తుందని ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి నాయిని రాజు అన్నారు. మండలంలోని రొంపేడులో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో విప్లవ శక్తులను ఏకం చేసే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా సీపీఐ(ఎంఎల్) పీసీసీ, సీపీఐ(ఎంఎల్) ఆర్ఐ, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఒక్కటై మాస్‌లైన్ పేరుతో మార్చి 3న ఖమ్మంలో బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దశాబ్దకాలం పాటు దేశాన్ని ఏలిన మోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలవడం కోసం రాముడి గుడి నిర్మించారని, ప్రతిపక్షాలను విచ్ఛిన్నం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఇటువంటి పరిస్థితిలో విప్లవ శక్తుల ఐక్యత అవసరమని చెప్పారు. సమావేశంలో సావిత్రి, పూనెం కుమార్, కోరం శాంతయ్య, ఆవుల కిరణ్, యాకూబ్‌షావలీ, బొర్ర వెంకన్న, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సాయి పవన్, వెంకటేశ్వర్లుకు సన్మానం



సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

పాల్వంచ: ఎన్‌పీడీసీఎల్‌లో సత్తుపల్లి జేఎల్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న బొల్లగాని సాయి పవన్, పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్న జి.వెంకటేశ్వర్లును సన్మానించారు. శనివారం సాయంత్రం స్థానిక తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(1104) కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి నుంచి ఉత్తమ కార్మికుడిగా అవార్డు అందుకున్న బొల్లగాని సాయి పవన్‌ను, విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీలో హ్యూమన్ రైట్స్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్న కేటీపీఎస్ 5వ దశ కర్మాగారానికి చెందిన ఫోర్‌మెన్ 2 జి.వెంకటేశ్వర్లును సన్మానించారు. రీజియన్ కార్యదర్శి పాతూరి రవీందర్‌రెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జమ్మల సీతారామిరెడ్డి, జెన్‌కో అధ్యక్షుడు కంటె రాజేందర్, కేశబోయిన కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, పి.రాము, నరేందర్, అశోక్, ఇస్లావత్ రాజేశ్ నాయక్, సయ్యద్, యాకూబ్, ఏసోబు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సంజయ్‌నగర్, హమాలీ కాలనీ, చాతకొండ పంచాయతీలకు సోమవారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ రఘు తెలిపారు. లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సబ్ కమిటీ ఏర్పాటుపై హర్షం

కొత్తగూడెంఅర్బన్: 317 జీఓకు సబ్ కమిటీ ఏర్పాటుపై టీఎస్పీటీఏ జిల్లా అధ్యక్షుడు లాల్ మహమ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 2018లో అప్పటి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో జీఓ 317 వలన అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయుల మరణానికి కారణమైందని, వారి కుటుంబాలను అనేక ఇబ్బందులు పాలు చేసిందని వివరించారు. ఈ జీఓ వలన భార్య ఒక జిల్లాలో, భర్త మరో జిల్లాలో పనిచేయాల్సి వచ్చిందని, దీని వలన వారి కుటుంబాల బాధలు వర్ణనాతీతం అన్నారు. 317 జీఓపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ తరుపున హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రమోషన్లు, ట్రాన్స్‌ఫర్లు, పెండింగ్ బిల్లులు, డీఏలు కూడా ఇవ్వాలని కోరారు.

ఉద్యమకారుడికి పరామర్శ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమకారుడు గంగుల రామారావు ఇటీవల అనారోగ్యంతో అస్వస్థతకు గురై సింగరేణి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యేఉలు శాంతిరామ్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి రామారావును పరామర్శించారు. ఈ సందర్భంగా శాంతిరామ్ మాట్లాడుతూ... ఉద్యమకారులు చాలామంది అనారోగ్యాలకు గురవుతున్నారని, మరికొంత మంది చనిపోయారని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కొరకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. పరామర్శించిన వారిలో చింతల చెర్వు గెర్షోము ఉన్నారు.

మట్టి పోశారు.. చదును మరిచారు



ప్రాథమిక పాఠశాల వద్ద సీసీ రోడ్డుపై మట్టి పోసిన దృశ్యం

టేకులపల్లి: టేకులపల్లి మండలం దాసుతండా పంచాయతీ సింగ్యా తండా ప్రాథమిక పాఠశాల వరకు ప్రధాన రహదారి నుంచి సంవత్సరం క్రితం సీసీ రోడ్డు వేశారు. నెల రోజుల క్రితం ఈ రోడ్డుకి సైడ్ బర్మ్ కోసం రోడ్డు పొడవునా స్కూల్ వరకు రోడ్డుపై మట్టిని పోశారు. కానీ చదును చేయడం లేదు. దీంతో చిన్నారుల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఇక్కడే అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సైడ్‌బర్మ్ కోసం రోడ్డుపై పోసిన మట్టిని తక్షణమే చదును చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పూసపల్లి కుట్ర కేసు ఎత్తివేయండి



మాట్లాడుతున్న రవి

ఇల్లెందు: ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూసపల్లి కుట్ర కేసు పేరుతో గ్రామాల్లో పోలీస్ నిర్బంధం కొనసాగిస్తున్నారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రవి ఆరోపించారు. ఆదివారం ఇల్లెందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా సీఎల్‌సీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మార్చి 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లో సీఎల్‌సీ రాష్ట్ర 50 వసంతాల ముగింపు సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభల్లో నిర్బంధ చట్టాలు – న్యాయ వ్యవస్థ అంశంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, దేశవ్యాప్త హక్కుల పరిస్థితిపై సామాజికవేత్త హర్షమందిర్, మతం రాజ్యాంగం – పౌర హక్కులు అనే అంశం మీద ఓ ఎడిటర్ ఇర్ఫాన్ ఖనుమ్, పత్రికా స్వేచ్ఛ – నిర్బందంపై ఎడిటర్ కె.శ్రీనివాస్, విద్యా కాషాయీకరణపై ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మధుప్రసాద్, ఇంకా ఈ సభల్లో ప్రొఫెసర్ నందినీసుందర్, మాడభూషి శ్రీధర్, ప్రొఫెసర్ సత్యపాల్, రైతు సంఘం నాయకుడు కన్నెగంటి రవి, కార్మిక సంఘం నాయకుడు పి.ప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. పూసపల్లి కేసు పేరుతో ఎన్డీ నేతలందరినీ ఈ కేసులో ఇరికించటం అన్యాయం అని తీర్మానం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన కొండన్నను కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఎల్‌సీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సింగు ఉపేందర్, రాయల పావేల్, పి.విప్లవకుమార్, కె.శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, భార్గవ్, రమణ, ఉదయ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

29న శ్రీరాములు సంస్మరణ సభ



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్డీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కోడి శ్రీరాములు సంస్మరణ సభను ఈనెల 29న మాణిక్యారంలో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సారంగపాణి తెలిపారు.

సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం మండలంలోని బొంబాయి తండా గ్రామంలో ప్రచార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిరుప్రాయం నుంచి విప్లవోద్యమంలో ప్రయాణించి తన పాట, ఆటతో ఎంతో మందిని విప్లవోద్యమ బాటలో నడిపించిన విప్లవకారుడు కోడి శ్రీరాములు అని కొనియాడారు. కార్యక్రమంలో మంగీలాల్, తారాచంద్, లచ్చు, కిషన్, సౌమ్య, బాలాజీ, భూక్యా శ్యామ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రులు భట్టి, తుమ్మల, ఎమ్మెల్యేలు

టేకులపల్లి: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరరావు–ధనలక్ష్మి దంపతుల కుమారుడు ఆదిత్య – సుప్రియ వివాహ రిసెప్షన్ ఆదివారం టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ రావులపాడు గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఎమ్మెల్యేలతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, పూనెం సురేందర్, నాగసీతారాములు, జానీ, భూక్యా దళ్‌సింగ్, గోచికొండ శ్రీదేవి, ఆకారపు స్వప్న, ఏలూరి జానకీ రాములు, గోచికొండ సత్యనారాయణ, సాంబశివ రావు, పూనెం ఉమ, నవీన్, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

చైతన్యంతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి



మాట్లాడుతున్న దయాకర్

ఇల్లెందు: సమాజంలో ఆర్యవైశ్యులు అభివృద్ధి సాధించాలంటే రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి దయాకర్ అన్నారు. ఆదివారం ఇల్లెందులో ఆర్యవైశ్య మండల పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజ శ్రేయస్సులో ఆర్యవైశ్యుల కృషి కీలక పాత్ర పోషిస్తుందని, కులమతాలకు, వర్గ విబేధాలకు అతీతంగా నిరుపేదలకు తమవంతు సహాయాన్ని అందిస్తూ సమాజ సేవ చేయడం ఒక్క ఆర్యవైశ్య జాతికే దక్కిందన్నారు. కానీ రాజకీయ రంగంలో మాత్రం వెనుకబడి ఉన్నామని తెలిపారు. ఆర్యవైశ్యులు అభివృద్ధి చెందాలంటే రాజకీయంగా కూడా ఎదగాలన్నారు. భవిష్యత్‌లో రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపులో ఆర్యవైశ్యులు తమ వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ గెలుపు కోసం గెలుపు కోసం కృషి చేసిన కల్వ సుజాతకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ గానీ రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌లో నామినేటెడ్ పదవికి ఆమెను ఎంపిక చేయాలని కోరారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, జి.కృష్ణ, భానుప్రకాష్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

జాతి హక్కుల కోసం పోరాడాలి



మాట్లాడుతున్న రవి

ఇల్లెందు: ఆదివాసీ జాతి అభ్యున్నతి, హక్కుల సాధన కోసం పోరాడాలని టీఎస్‌టీపీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ల శ్రీనివాసరావు, కబ్బాకుల రవి కోరారు. ఆదివారం ఇల్లెందులోని గోవింద్ సెంటర్‌లోని పెన్షనర్ భవన్‌లో టీఎస్‌టీఎఫ్ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ఏరియా ఏజెన్సీలో ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధ్యాయ ఉద్యోగ అవకాశాలు, ఉపాధ్యాయులకు ఏజెన్సీలో పదోన్నతులు కల్పించే విధంగా పటిష్టమైన జీఓ నంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నూతన పీఆర్‌సీలో హెచ్‌ఆర్ఏ, ఏహెచ్‌ఆర్ఏ, ఎస్‌సీఏ వంటి ఏజెన్సీ అలవెన్సులు అధిక మొత్తంలో పెంచాలని కోరారు. ఆదివాసీ గిరిజన సామాజిక వర్గం నుంచి ఉద్యోగాలు చేస్తున్న ఉపాధ్యాయులు ఉద్యోగులు ఆదివాసీల అస్థిత్వం, మనుగడ కోసం, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆదివాసీ గూడేలలో విస్తృతంగా పర్యటించి జాతి హక్కులపై, ఆదివాసీ ప్రజలకు చైతన్యం కల్పించి ఉద్యమాల బాట పట్టించాలని కోరారు. ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులను జాగృతం చేసేందుకు వచ్చే నెలలో సంఘం రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ సభలు విజయవంతం చేసేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు వాసం కుమారస్వామి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుర్సం అంజయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉడతనూరి లింగయ్య, పీర్ల కృష్ణబాబు, మల్లిపల్లి విజయభాస్కర్, కుంజ కృష్ణ, కోరం సంతోష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాయం ఆనందరావు, చాపల రమేష్‌బాబు, సిద్ధబోయిన భిక్షం, కల్తీ భాస్కర్, బొగ్గుల లక్ష్మయ్య, కట్రాజు లింగుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి



కొత్తగూడెంలో మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

చుంచుపల్లి: గడిచిన పదేళ్ల కాలంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో పయనించిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందని చెప్పారు. పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న పార్టీ బీజేపీయేనన్నారు. నిరుపేదలకు మరుగుదొడ్ల పథకం, ముద్ర రుణాలు, మహిళలకు రుణాలు వంటివి విజయవంతంగా అమలు చేస్తూ బీజేపీ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న పథకాల్లో ఎక్కువ శాతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టివేనని వాటిని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దేశం మరింతగా అభివృద్ధి సాధించాలంటే మరోసారి బీజేపీ గెలవాలని దానికోసం పార్టీకి ప్రజల అండదండలు వచ్చే ఎన్నికల్లో ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి పాత ముఖ్యమంత్రిని తిట్టడమే సరిపోతోందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టు కూలడానికి సిద్ధంగా ఉందన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి 10 ఏళ్ల పాలనలో దోచుకోవడమే తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టలేదని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంటు స్థానంలో బీజేపీని గెలిపించి నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. యాత్ర ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేవీ రంగాకిరణ్, సీనియర్ నాయకులు వాసుదేవరావు, ఈవీ రమేష్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆకుల నాగేశ్వరరావు, రాయుడు నాగేశ్వరరావు, నరేంద్రబాబు పాల్గొన్నారు.

వచ్చేది గల్లీ ఎన్నికలు కావు.. ఢిల్లీ ఎన్నికలు

పాల్వంచరూరల్: వచ్చే ఎన్నికలు గల్లీ ఎన్నికలు కావు.. ఢిల్లీ ఎన్నికలు అని మరోసారి మోదీని గెలిపించి దేశాభివృద్ధికి అందరూ సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. బీజేపీ నాయకులు చేపట్టిన విజయ సంకల్ప యాత్ర ఆదివారం రాత్రి పాల్వంచకు చేరింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు యాత్రకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రోడ్డు షో నిర్వహించారు. మాట్లాడుతూ... ప్రధాని నరేంద్ర మోదీ పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ చెల్లని నోటుతో సమానం, కాంగ్రెస్ పార్టీకి కాలం చెల్లిందని విమర్శించారు.